

**పవిత్రత విలువ పతనమైన స్త్రీకి తెలిసినంతగా ఎవరికీ తెలీదు. ఒక ఆడపిల్లను 'పతిత'గా మార్చేందుకు ప్రేమ ఒలకబోసే మగవాడు, ఆమెను ఉద్ధరించడానికి కనీసం చిటికిన వేలైనా ఆసరా యివ్వడు. మగవాడు ఒకసారి పడితే మళ్ళీ పైకి లేవగలడు. ఆడది ఒకసారి పడితే రోజు రోజుకు మరింతగా దిగజారడమేగానీ, పైకి లేవడం అంటూ జరగదు.**

రాత్రి తొమ్మిది కావస్తూంది. దీపాల వెలుగు పట్నంమీద సముద్రంలా ప్రవహిస్తూంది. కార్లు, బస్సులు, స్కూటర్లు, ఆటోలు, రిక్షాలు—ఇంకా ఎన్నెన్నో వాహనాలు క్రింద రోడ్డు చేసుకుంటూ పోతున్నాయి. వందల కొలదీ జీవాలు— ఏడుస్తున్నట్టున్న ఆ రొద అసహ్యమనిపిస్తూంది సరళకు.

రెండంతస్తుల మేడ మీది చివరి గదిలో కిటికీ దగ్గర కూర్చుని నగర నాగరికతను చూస్తూ, అసహ్యించుకుంటూన్న సరళకు ఏవేవో ఆలోచనలు తరంగాలకు మల్లే జ్ఞప్తి కొస్తూ బాధిస్తున్నాయి. బాధను అదుముకోలేకపోతూంది— భయపడ్తూంది!

బేబీ ఇంకా నిద్ర లేవలేదు. లేస్తే పాలుపట్టి నిద్రపుచ్చాలి. కాని, అదప్పుడు నిద్రపోదు. ఎంతకని నిద్రపోతుంది. దానికి విసుగన్పిస్తుందేమో!

గుర్నాథం ఇంకా రాలేదు. వస్తే బాగుణ్ణు! వేగంగా ఉన్నకాడికి తినేసి నిద్రపోవచ్చు. నిద్రలో ఇన్ని బాధలూ, భయాలూ ఉండవు. అయినా, తనకి మూడ్నాలుగు రోజులై కంటి మీదికి

ఎ. ఎన్. జగన్నాథ శర్మ

కునుకు రావట్లేదు. విచిత్రం!! నిద్రలేక మరీ నీరసంగా ఉంది. నరాలన్నీ దిగ లాగేస్తున్నట్టు, నాడు లేవో తెగిపోతున్నట్టు శరీరంలో ఏదో అలజడి సరయిన ఆహారం తీసుకోక పోయి, సమయానికి తగ్గ దిన చర్య చేయకపోతే మనిషి మరి ఇలానే తయారవుతాడు.

సరళకి ఆకలి వేస్తూంది. ఆకలి వేసినప్పుడే ఇంత తినగలిగేది. తరవాత లేనేలేదు. ఆ మధ్య గుర్నాథం అలాగే అపరాత్రి పన్నెండూ రెండు గంటల మధ్య వస్తూ ఆకలి లేదని మంచినీళ్ళు తాగి పడుకొన్నాడు.

గుర్నాథం వచ్చేస్తే బాగుణ్ణు! తోడుగా ఉంటే రెండు ముద్దలు తృప్తిగా కతకొచ్చు! అయితే, అతనొచ్చే జాడే లేదు!

సరళ రోడ్డు కనిపించినంత మేరకు దృష్టి సారించి చూసింది. ఏ మనిషి పొడవుగా ఉండి, ముందుకు వంగిపోతూ నడుచుకొచ్చిన పాపాన పోలేదు! అలా నడుచుకొచ్చిన వ్యక్తే ఉంటే, అతను గుర్నాథం అయి ఉంటాడు.

వాణిజ్య ప్రకటనలకు
ఆంధ్రప్రభ
ఉత్తమ సాధనం

వేలకు వేలు కోరుకొను
రంభ
మరికొళుందు సెంటు
Ramba
MARIKOLUNDU SCENT
రంభ కాస్మొటిక్సు,
అడయారు, మద్రాసు-20.

డా॥ పి. వి. కె. రావ్, B.A.



సెక్సు స్పెషలిస్ట్ వైద్య (విద్వాన్ — వైద్యాచార్య), వివాహము కాకుండా వేయ వవసరము లేదు దురభ్యాస ములవలన కలిగిన వరములు బలహీనత, మొదలగు వ్యాధులకు ఆయుర్వేద చికిత్స. పోస్టు ద్వారా కూడ చికిత్స కలదు.
రాఘవ క్లినిక్,
ఆర్. ఆర్. రోడ్, తెనాలి. ఫోన్: 700
SUVARNA

ఉచితము! ఉచితము!!
తెల్లమచ్చలు
మా చికిత్స ప్రారంభించగానే మచ్చల రంగులో మార్పు వస్తుంది. పరీక్షించి మా మందు ఏంత పనిచేస్తుందో చూడండి. రోగ వివరాలు వ్రాసి ఉచితంగా ఒక ప్యాకెట్ మందు పొందండి.
LALIT AYURVEDIC
PHARMACY (AW)
P.O. Katri Sarai (GAYA)

జగన్నాథం పొడవుగా ఆరున్నర అడుగుల మనిషి. అంత పొడవు వల్ల బలంగా ఉన్నా, మనిషి వంగిపోతూ నడుచుకొస్తున్నట్టు కనిపిస్తాడు. కొత్తలో అతన్ని 'ప్యానేరియా గులిక' అని ఉడికించేది. నవ్వుతూ ఊరుకొనేవాడు. అయిదారుసార్లు అతనలా అనేసరికి —" మీరు ఇంటర్మీడియట్‌లో బై. పి. గ్రూపా" అనడిగాడు. ఆ రోజు కనిపించని ఎత్తిపొడుపుకి సిగ్గుపడటం తన వంతయింది. సఖి, శారదలు — "గొప్పగా కనిపెట్టేశాడు సీ్మ!" అని వాపోయారు.

చదువుకొన్న రోజులు గుర్తుకొస్తే —అమ్మా, నాన్నా, చెల్లెళ్ళూ, తమ్ముడూ గుర్తుకొస్తారు. అంతకన్నా భయంకరంగా బొద్దు మీసాల్తో మర్రి వృక్షంలా ఉండే బోటనీ లెక్చరర్ కూడా గుర్తుకొస్తాడు. వాణ్ణి తలుచుకొంటే చాలు—ఒళ్ళంతా కంపరం రేగుతుంది. మొదట్లో తుపాను పుడుతుంది. ఒక్కసారి ఏ మయ్యో గొయ్యో చూసుకుని 'దభేల్న' గెంతేద్దామనిపిస్తుంది. లేకపోతే ఉరిపోసుకుని చచ్చిపోదామనిపిస్తుంది.

భగవాన్! ఆ రోజు లెలాంటివి? ఎంత ఘోరంగా—దరిద్రంగా గడిచాయి.!!

నాన్న రైసుమిల్లులో వర్కు చేసేవాడు. పెంకి మాట ఏభై కరకుల జీతగాడు. రోజూ రాత్రి పదప్పుడు ఇంటికొస్తూ అమ్మ చేత చెడ చీవాట్లు తినేవాడు. అమ్మ అతని సంపాదనని సంసారానికి సర్దలేక అసహనంతో రెచ్చిపోయేది. ఇల్లొక నరకంగా ఉండేది.

తమ్ముడు పాలు చాలక ఏడ్చేవాడు. చెల్లెళ్ళు ఆకలి తీరక గోల చేసేవారు. అమ్మ తలా ఒకరికి ఒక్కొక్క చరువు చరుస్తూ నిద్రపుచ్చేది. వాళ్ళంతా నిద్రపోతే, ఒక్కత్తే కూర్చుని రాత్రంతా రోదించేది.

తను!?

పదహారు పదిహేడేళ్ళది! కొద్దిగా కడుపునకట్టు కోగల స్తోమత కంది. ఒక్కో రాత్రి అన్నం చాలకపోతే అమ్మా, తనూ తినడం మానేసేవారు. నిరాహారంగానే పడుకునే వారు. కాని, ఏ రాత్రో కడుపులో ఎలకలు పరుగెత్తినట్టనిపిస్తే లేచి వడేసి దోసిళ్ళ మంచినీళ్ళు తాగి పడుకునే వారు. అమ్మ అప్పుడు తనని చుట్టుకుని ఏడ్చేది—"మన ఖర్మ" అంటూ గుండెల బాదుకొనేది—నాన్నని దూషించేది.

అయితే, అంత లేమిలోనూ తను పట్టుపడితే టెన్త్ ఫస్టుక్లాసులో పాసయినందుగ్గాను వాళ్ళ కాళ్ళూ వీళ్ళ కాళ్ళూ పట్టుకొని తనని తండ్రి ఇంటర్మీడియట్‌లో జాయిన్ చేశాడు. చిన్నప్పట్నుంచీ తనకి డాక్టర్నవ్వాలని కోరిక. స్టెతస్కోపు మెళ్ళో వేలాడుతుంటే హుందాగా నడవటం ఆశగా ఉండేది. అందుకే కోరికోరి ఆర్థికంగా భరించలేని గ్రూపులో చేరి తరవాత తీసుకు చచ్చింది.

సరయిన బట్టలు ఉండేవి కావు. ఒక్కొక్కప్పుడు తలకి తైలం సంస్కారంకూడా ఉండేది కాదు. అయినా అన్నింటికీ పెట్టుకొన్ని స్థిరంగా ఉన్నంతలో తయారయి కాలేజీ వెళ్ళేది. ముత్యాల్లా మెరిసిపోయే తన రికార్డుల మీద ఎవరి చూపు లేకపోయినా, చిరుగులు గల తన ఓణీ మీద అందరి మగాళ్ళ చూపులూ నిలిచేవి. అందులో... అందులో బోటనీ లెక్చరర్ జగన్నాథం గాడి చూపు! అమ్మో!! అమాంతం తనని తినేసేలా ఉండేది. బొద్దు మీసాలవాడూ—అందర్నీ అదరగొట్టేసేవాడు. పని గట్టుకొని ఆడాళ్ళ మీద విరుచుకు పడేవాడు. కొన్ని కొన్ని సాయంత్రాలు ఊరకనే కుర్రాళ్ళను విడిచి పెట్టేసి అమ్మాయిల్ని ప్రాక్టికల్స్ అంటూ ఉంచేసే వాడు. ఉంచేసి వెధవ జోకులు వేసేవాడు. వాడి జోకులకి సగం చచ్చేవాళ్ళం. కాని, అదెవరు! రత్నం! డిప్యూటీ తాశీల్దారు గారి కూతురు. అదే మాత్రం విరగబడి నవ్వేది. దాన్నవ్వు అతగానికి మాత్రం నచ్చేది గాదు. పాపం! మళ్ళీ చిర్రుబుర్రులాడేవాడు.

అలాంటి రోగ్, వెధవ, రాస్కెల్ ఒకరోజు ఏం చేశాడు!!?

అందర్నీ లాబ్‌లోంచి పంపించేసి తన నొక్క దాన్నే ఆ సాయంత్రం తన రికార్డేదో దిద్దుతూన్నట్టు నటించి ఉంచేశాడు. అప్పటికే కాలేజీ వదిలేసి గంటన్నర అయింది. స్టూడెంట్లు దూరంగా గ్రౌండులో ఫుట్‌బాల్ ఆడుకొంటున్నారు. స్టాఫ్‌లో ఇంకే లెక్చరర్ లేరు. అందరూ ఇళ్ళకి వెళ్ళిపోయారు. ఒక్క బోటనీ లాబ్ తెరిచి ఉండటం ప్యూన్ నూరికి అనుమానం కూడా రాలేదు. ఉన్నది తనొక్కత్తేనన్నది కూడా అతనికి తెలిసి రాలేదు. లేకపోతే అంత దురంతం జరగనిచ్చేవాడు కాదు! నూరికి బీదపిల్లనని తనంటే అభిమానం.

రికార్డు దిద్దుతూ దిద్దుతూ బొద్దింక బొమ్మ బాగానే వేశారంటూ పొగిడాడు. అయినా, అలా పొగిడిన దాన్నే పెన్సిల్ పెట్టి దిద్ది తరవాత బాగా పాడు చేశాడు! పాడు చేసేసి 'సారీ' అన్నాడు. తన కప్పుడు అంతా అయోమయంగా తోచింది. ఎంత వేగిరం ఈ గుహలోంచి బయట పడతా ననిపించింది. కాని, పీల్లేకపోయింది. ఆ ఇడియట్ తన కుటుంబ విషయా లడిగాడు. చూపొస్తాసి మెరుగ్గానే చెప్పింది. తన తండ్రి లేబర్ యూనియన్ లీడరని, ప్రత్యేకించి చెప్తూ గొప్ప కోపిష్ఠి అని కూడా చెప్పింది. అయితేనేం!! ఎన్ని ఇనుప పరదాలు తన చుట్టూ దింపుకొంటే మాత్రం చొరుకొనాలనుకొన్న రాక్షసి తెగింపు చెయ్యక మానదు.

ఉండుండి ఆత్రంగా తన వైపు చూస్తూ గభాల్న చేయి అంది పుచ్చుకొన్నాడు జగన్నాథం. తను విడిపించుకో బోయింది. అయింది కాదు. ఉక్కు బిగింపు అతనిది. గింజుకొంది. బ్రతిమలాడింది. పేదతనం మనిషికి కాని మనసుకు కాదంది. విని పించుకుంటేనా!? వాడు మీదికి ఉరుకుతూంటే కేకలు వేసింది. కేకలకి నూరి, స్టూడెంట్లూ పరుగెత్తుకొచ్చారు. జరిగింది చూసి నూరి జగన్నాథాన్ని చితక బాదాడు. తనకి వాడి చేత క్షమాపణ చెప్పించాడు. దగ్గరుండి ఇంటికి దిగబెట్టాడు.

తరవాత!!! ఏం నూడుపుకాలే జరిగిందో

ఏమో కాని తనని, నూరిని కాలేజీ నుంచి [illegible] మేశారు. దిక్కులేక పోయింది తమకి!!!

అదంతా తలచుకొంటుంటే ఏడుపొచ్చింది సరళకి. నిండుగా ఏడ్చుకొంది. ఇంతలో బేబీ లేచి ఏడుపు ప్రారంభించింది. కళ్ళొత్తుకుని ఉయ్యాల దగ్గరికి నడిచి ఏణ్ణర్ధం బేబికి పాలు పట్టి నిద్ర పుచ్చింది. నిద్ర పోవటం లేదు బేబీ.లేచి ఏడుస్తూనే ఉంది. సముదాయించటం ప్రారంభించింది. గంటా, రెండు గంటలూ గడిచాయి. అయినా, ఏడ్పుమానటంలేదు. సరళకి విసుగనిపించింది. అనిపించి రెండు వేసింది బేబీకి. దాంతో ఏడుపు మరీ స్థాయి తారకు చేరుకొంది.

ఆ ఏడుపు చూస్తుంటే జడు పడింది. సరళ. ఇది ఇలా ఏడ్చేడ్చి చచ్చిపోతుంది కామోసు అనిపించింది. ఆ తలపే మనిషిని నిలువునా కదిల్చేసింది. ఏం చెయ్యాలని ఆలోచిస్తూ దాన్ని పట్టుకుని పీడా పిశాచమో నని తిట్టింది. అంతకీ ఏడుపు మానకపోతే దిష్టి తగిలిందేమోనని గుప్పెడు బియ్యం తీసుకుని దిష్టి తీసి కిటికీ బయట పారవేసింది. దాంతో ఏడుపు మాని వెక్కడం ప్రారంభించింది. బేబీ. తరవాత లాలిస్తే నీరసంగా గురకపెడుతూ పడుకొంది. అప్పు డనిపించింది సరళకి —

ఫ్లోర్‌లో ఇవాళ అందరి కళ్ళూ బేబీ మీదే ఉన్నాయి. అందంగా కూతుర్ని తను అలంకరించింది. ఆదేదో సినిమాలో ఒక ధనవంతుడి కూతురి బారసాల ఉత్సవం — సెట్‌లో చిత్రీకరింపబడింది. దానికి తన కూతుర్ని తెమ్మని మేస్త్రీ మహాలింగం చెప్పగానే తీసుకు వెళ్ళింది. రెండు గంటల సేపు షూటింగ్ జరిగింది. అంత లైట్ల మయంలోనూ ఎంత అందంగా నవ్వింది బేబీ! హీరోయిన్ నాలుగైదు సార్లు ముద్దు పెట్టుకొంది. హీరో గారు అక్కున చేర్చుకొన్నారు. అచ్చూసి తనెంత మురిసిపోయిందని! కళ్ళ నీళ్ళు కూడా పెట్టుకొంది కదూ! దాని బ్రతుకు నిజానికి అలా జరగడం లేదని. తదనంతరం ముప్పై రూపాయలు ఇచ్చారు. ఆ డబ్బుతోనే బేబీకి కావలసిన మైనోలేటెడ్ పౌడర్, గ్లూకోజు, ఇంకేవో టాబ్‌లెట్స్ కొన్నది. పన్నెండు రూపాయలు మిగిలాయి. మూడ్రోజులకి ఫర్వాలేదనిపిస్తోంది.

బేబీ నిద్రపోయింది. మరిప్పట్లో లేవదు. రాత్రి పదిన్నర దాటుతోంది. గుర్నాథం మరిప్పట్లో రాడేమో! సరళని తరగని ఆలోచనలు తొలిచేస్తున్నాయి.

ఇంటి మీదికి ధ్యాస మళ్ళినక్కొద్దీ,ఆ విషయాలు గుర్తుకొస్తే అమ్మా నాన్న, తమ్ముడూ చెల్లెళ్ళూ, మర్రి వృక్షంలాంటి బోటనీ లెక్చరర్—వీళ్ళంతా గుర్తుకొస్తారు. వీళ్ళతో పాటు వాడెవడు!?సత్యన్నారాయణ అనబడే సత్తిగాడు — వాడే స్కౌండ్రల్! వాడొకడు తనకి గుర్తుకొస్తాడు కదూ!!

పొట్టిగా, దుబ్బుగా ఉండి నాటకాలు వేసే నాటకాల మనిషి సత్యన్నారాయణ. మాటల్లో, [illegible] అప్పింటితోపాటు నాటక పక్కీ [illegible]. తమ ఇంటి ముందున్న గది[illegible] పిరికి రూపాయలకు అద్దె కుండేవాడు. [illegible] జ్యూట్ మిల్లులో పన్చేస్తున్నాననే వాడు. కాని, ఆ ఛాయలే కనిపించేవి కావు. మున్నూట అరవై రోజులూ నాటకాలు, రిహార్సల్స్ అంటూ అందర్నీ తోడ్చుకొని తిరిగేవాడు. వాణ్ణి తలచుకొంటుంటే గుండెలో పడగళ్ళు చెరిగినట్టనిపిస్తుంది. బ్రతుకులో నిప్పులవాన కురిసినట్టనిపిస్తుంది. పూర్వ జన్మలో ఏ పాపానికో వాడి పరిచయం కలిగి, ఏ శాపఫలమో వాడితో కలిసి మెలగడం అనిపిస్తుంది. అయితే, ఆ సత్తిగాడు ఏం చేశాడు తనకి!? ఆశలు రేపి, అంధకారంలోకి తోసేశాడు! కోరికలు గుండెలోకి చొప్పించి 'పఫ్'న మంట గలిపేశాడు!! అవునా!?

కాలేజీ నుంచి తనని తరిమేసిన రోజుల్లో— దిక్కు తోచక ఇంట్లో [illegible] ఏడుస్తూ [illegible] చిన్నగా కాలాన్ని గడిపేది. అటువంటప్పుడే సత్తిగాడికి అవకాశం కలిగింది. నక్కలనేవి చచ్చిన శరీరాల కోసం కాచుకక్కూర్చుంటాయి. అలాంటి నక్కగాడే సత్తిగాడు. అయితే సత్తిగాడు ఏం చేశాడు!?

ముందురోజుల్లో మొహమాటంగా పలకరించి మాట్లాడేవాడు. మాట్లాడుతున్నప్పుడు అమ్మా, నాన్నా కాని తారసపడితే కలుగులోనికి దూరిపోయిన ఎలుకలా గదిలోనికి పారిపోయేవాడు. అప్పుడే వాడి నైజాన్ని తెలుసుకోలేక పోయింది. తరవాత తరవాత ఇంట్లోనే నలుగురైదుగుర్ని వెంట వేసుకొచ్చి గదిలో 'రిహార్సల్స్' అంటూ పాటలూ పద్యాలూ పాడేవాడు. ఏవేవో పరిషత్తులకు వెళ్తున్నామంటూ గొప్పగా చెప్పుకునేవాడు. వచ్చిన నటీనటులకు తనని పరిచయం చేసేవాడు. చేస్తూ [illegible] మంచి వాయిస్ ఉందని, కళ్ళు కూడా పెద్దవని, కాబట్టి మంచి ఫీలింగ్స్ ఇవ్వగలదంటూ చెప్పేవాడు.



ఆ నవ్వులో ఎంత సంతృప్తో

(—ఫొటో ఎల్. ఆర్. గ్రోవర్)

వీలయితే తమ నాటకాల్లో పాత్రలని తీసుకుని పది మందినీ మెప్పించమంటూ అర్థించేవాడు. ఆ అర్థింపు నిజమనుకొంది. అతని మాటల్ని విశ్వసించింది.

మహానటుడంటూ వాడి రూముకు వచ్చే వాళ్ళకి కాఫీ, టీలు సప్లై చేయమంటూ పాడిని, పంచదారని తనకిచ్చి ఇంట్లో కాచమని ప్రార్థించేవాడు. రెండు మూడు సార్లు వాడి ప్రార్థనని తను తిరస్కరించింది. కాని అమ్మ! 'పోనీలేవే! అతనికి చేత కాదు. చేతులు కాల్చుకోలేక ఆడవాళ్ళం కాబట్టి మనకి చెబుతున్నాడు. చేసి పెడుదూ' అంటూ వాణ్ణి సమర్థించేది. అమ్మ మాటను తను కాదనలేక పోయేది. వాడి క్కావాల్సిన హంగులన్నీ అమ్మ ఇష్ట ప్రకారం అమర్చేది. అయితే, అమ్మకి అసలు విషయం తెలీదు. సత్తిగాడి లాంటి వెధవలు తమ చేతుల్ని కాల్చుకోరు. అలా తమ చేతుల్ని కాల్చుకోకుండానే పరాయి వాళ్ళని తుద ముట్టించేస్తారు!!

ఈడొచ్చిన పిల్ల ఇంట్లో ఉండటం తల్లులకి గుండెల మీద కుంపటని, నాన్న తెచ్చే సంపాదన ఏ దానికీ సరిపోదని అమ్మ ఆ సత్తిగాడితో కష్టం, సుఖం చెప్పుకునేది. వాడు అవన్నీ వింటున్నట్టుగా నటించేవాడు. బాధ పడేవాడు. అప్పుడూ అప్పుడూ పదీ పాతికా అప్పులిస్తూ అమ్మ గుర్తింపును పొందాడు. 'కుర్రాడు సలక్షణమైన వాడు! బాధలకు కరిగిపోయే వెన్న గుండెవా' డని అనిపించుకున్నాడు. అనిపించుకుని విజయ బావుటా నట్టింట్లో ఎగరేశాడు.

పండగలకీ, పబ్బాలకీ అతిథి భోజనాలు తమ ఇంట్లో చేసేవాడు. చెల్లెళ్ళందరూ వాణ్ణి 'మామ' అంటూ పిల్చేవారు. నాన్న కూడా వాడి మాయకు లోనయిపోయాడు. ఎలా అయితే నేం, ఇంతమందినీ నమ్మించి అనుకొన్న ప్లాను అమలు కావటం కోసం ఒకరోజు శ్రీకారం చుట్టేశాడు.

అమ్మతో అన్నాడు కదా—

"దేశం చాలా ముందుకు పోతూంది. దేశమే కాదు, ప్రపంచం కూడా చాలా చాలా ముందుకు పోతూంది. అంటే, మనుషులు బాగా ఎదిగేశారు. ఒకప్పటి తెలివిమాలినతనం, త్యాగాలు, సెంటిమెంట్స్, బలహీనతలు ఇప్పటి వ్యక్తుల్లో లేవు. అందరి కందరూ బ్రతక నేర్చడం తెలుసుకొన్నారు. అలా బ్రతక నేర్చడం తెలుసుకోబట్టే ఆడా మగా తేడా లేకుండా వయోజనుడైన ప్రతి వ్యక్తీ ఇతరుల మీద ఆధారపడటం మానేసుకుని ఉద్యోగాలు వెతుక్కుంటున్నారు.

ఉద్యోగమంటే ఒక ఫ్యాక్టరీలోనో, ఒక ఆఫీసు లోనో టైపు చేసుకుంటో, లెక్కలు రాసుకొంటో గడిపేది కాదు. ప్రతీది ఉద్యోగమే! అది నాలుగు డబ్బులు సంపాదించగలిగి ఉండాలి! మీకు తెలీదు. ఈ వెధవ్వూర్లో ఇలా ఒకర్నొకరు పట్టించు కోవటం గాని, పెద్ద పెద్ద పట్టణాలలో ఇలాంటివేం జరగవు. అక్కడదంతా మోడరన్ లైఫ్!! ఒకరు పట్టించుకొంటున్నారని, ఇంకొకరు ఎగతాళి చేస్తున్నారని వాళ్ళు బ్రతకడం మానుకోరు.

ఏ డెనిమిది వందలు సంపాదిస్తూ ఏ ఆఫీసు లోనో ఉద్యోగం చేసే ఆడదే రాత్రయేసరికి మరేదో క్లబ్బులో డాన్స్ చేస్తూంది. అక్కడ అది తప్పు కాదు. మీరు బాధ పడకండి! అలాగే నిజానికి తండ్రీ కూతుళ్ళయిన వాళ్ళే అక్కడ ఆ డ్రామా కంపెనీల్లో మొగుడూ పెళ్ళాలుగా నటిస్తూ డబ్బులు సంపాదిస్తారు. అక్కడ ఒకరు తమని పట్టించుకొంటున్నారని వాళ్ళు బాధ పడితే క్షణక్షణానికీ డబ్బు అవసరమయ్యే వెధవ జీవితాన్ని వాళ్ళెలా నెట్టుకరాగ్రలు!!

అలాగే నే చెప్తున్నానని మీరేం అనుకోకండి! తమ్ముళ్ళా భావించండి. తప్పు అని తోస్తే మందలించండి. మీదా మధ్య తరగతి కుటుంబం. ఎటామొటీ బతుకులు. పిల్లలకు సరయిన భవిష్యత్తు మీరు చూపిస్తారంటే నాకేం నమ్మకం కలగట్లేదు. ఇలా జిడ్డు జిడ్డుగా—మురికి మురికిగా వీళ్ళు బ్రతకాల్సిందేమో ననిపిస్తూంది. అందుకని వేణ్ణీళ్ళకు చన్నీళ్ళు తోడుగా ఉంటాయని సరళని మా నాటకాల్లో చేర్చుకొందామని, చేర్చుకొన్నందుకు ప్రతి నాటకానికీ వంద రూపాయలు పారితోషికం ముట్టచెప్తామని చెప్తున్నాను. ఇంకోలా అనుకోకండి! నాటకాల్లో వేసే ఆడదానికి పెళ్ళవుతుందా అని మీరు దిగులు పడొచ్చు! అదేం లేదు. చూస్తున్నారుగా—సినిమా నటుల్ని ఎంతెంత పెద్ద పెద్ద ఆఫీసర్లు వివాహ మాడేదీను. ఆలోచించండి! నా ఊహ తప్పయితే నన్ని గదిలోంచి—మీ మదిలోంచి పొమ్మనండి!" అని అమ్మకి నూరిపోయాల్సిందంతా నూరి పోసి, నమ్మిక కలిగించి తనని డ్రామా నటిని చేయడానికి 'సరే' ననిపించుకొన్నాడు.

తన కా విషయాన్ని చెప్పి, 'కంగ్రాచ్యులేషన్స్' అంటూ నవ్వాడు. తెగ సంబర పడ్డంతగా ఫీలయ్యాడు. 'ఎంత నటుడు కాకపోతే అమ్మలాంటి మధ్య తరగతి ఆడదాన్ని ఒప్పించగల దీరుడయ్యేవాడు' అనుకొంది. ఇష్టం లేకపోయినా తను








డ్రామా నటి కావాలని నిశ్చయించుకొంది. అయితే, సత్తిగాడు అప్పుడప్పుడూ ముట్టచెప్పే వంద రూపాయలకు తమ సంసారం ఏ ఒడ్డూ చేరదని తెలిసి కూడా వాడి వెంట తిరుగుళ్ళు తిరిగింది. కొన్ని కొన్ని పరిషత్తులకు వెళ్ళింది. అక్కడ తనకి ఉత్తమ నటి బహుమతులు రాకపోతే జడ్జీల ముందు మోకరిల్లి తెప్పించేవాడు సత్తి. దిగ్రేట్! వాడి కష్టాన్ని చూస్తుంటే మనిషిని నమ్మాలనిపించేది. వాడితో ఏమాత్రం సరదాగా గడిపినా అమ్మ ఆలోచనలు అదో రకంగా ఉండేవి. "బాబు మనింటి అల్లుడయినా బాగుణ్ణు! ఈడూ జోడూ కుదిరింది కదూ!" అని రెండు మూడు సార్లు అమ్మ నాన్నతో అన్నట్టు తనకి లీలగా తెలిసింది. ఆ ఊహ తనకే సమంజస మనిపించిందా క్షణంలో. ఎందుకంటే, తనలాంటి సడిమింటి బతుకులకి అంతకన్నా మెరుగైన సంబంధాలు రావని, వచ్చినా నిలవలేవని లోకం పోకడ తెలుసుకోవడంతో 'సరే' ననుకొంది. తనకై అవస్థలు పడుతూన్న ఆ పుండాకోర్‌ని చూస్తూసి తెలిసి తెలిసే ఎంతగానో అభిమానించింది. అంత అభిమానాన్ని వాడెలా ఉపయోగించుకున్నాడు!?

"చూడు, సరళా. అవకాశా లుండి వినియోగించుకోక పోవడం చాలా తెలివితక్కువతనం! నా మట్టుకు నేనే ఈ విషయంలో చాలా బాధ పడుతుంటాను. అమ్మా: నాన్నా ఉండి చదివిస్తాం—చదువుకోరా అంటే వినిపించుకోలే! నాటకాల పిచ్చిలో పడ్డాను. జీవితాన్ని విశాలంగా—హాయిగా చూడలేక పోయాను. ఈ వెధవఫ్యాక్టరీలో పన్చేసూ అయిదారు వందల సంపాదన తోనే తృప్తి పడటం నేర్చుకొని పూల్నయ్యాను. నా మనసులో మాట నీకు చెప్పకేం! ఎక్కడ ఉంచవలసిన వస్తువు అక్కడ ఉంచితేనే అందం, రాణింపూను. బొగ్గును తీసుకుపోయి వజ్రాల హారంలో ఉంచినా, వజ్రాన్ని తీసుకుపోయి బొగ్గుల్లో వేసినా వాటి విలువలు తారుమారవుతాయి. అలాగే గొప్ప రాజకీయ నాయకుడు దేశానికి ఏ ప్రధానమంత్రో లేక ఏ రాష్ట్రపతో కావల్సినవాడు పల్లెటూళ్ళో మామూల్లు రామ్మందిరం పొలిటీషియన్ కావటం నేసహించను. అలాగే ఏమహానటో కావలసిన వ్యక్తి మామూల్లు వీధి నాటకాల్లో వేసూ కాణీకి పరక్కి కక్కుర్తి పడటం మంచిదనిపించు కోదు!! లక్షల్లక్షలు గడించాల్సిన నుదుటి రాత క్లోజప్‌లో మహా వైభవంగా కనిపిస్తుంటే, మీలాంటి వాళ్ళు ఉండాల్సిన ఊరు, స్థితి ఇది కాదు. నన్ను విశ్వసించండి! మిమ్మల్ని నటిగా స్వీకరించ గలగటం తెలుగు చలనచిత్ర రంగం గర్వించ దగ్గ విషయం. కాబట్టి తక్షణం మీరు అవకాశాల్ని వెతుక్కుంటూ పట్నం పోవాలి! వెండి తెర మీద మీరు అఖండ జ్యోతిలా వెలిగిపోవాలి! వెలుగుతారు కూడా. మీకు ఆ నసీబు రాసుంది. అప్పుడు మీ చుట్టూ ఎన్నో సంస్థలు, మిమ్మల్నాశ్రయించుకొని నౌకర్లు, చాకర్లు... ఇంకా తమ్ముణ్ణి ఏ కాన్వెంటులోనో జాయిన్చెయ్యొచ్చు, చెల్లెళ్ళకు కోటీశ్వరుల్నిచ్చి కట్టబెట్టొచ్చు. పోతే మీ పలుకుబడీ, స్థాయీ చెప్పనలవి కాదు. కార్లు, మేడలు, బంగళాలు, కోరుకున్న జనం మీ చుట్టూ ఉంటే అప్పుడీ అల్పుడు మీకు జ్ఞాపకం వస్తాడో లేదో!!




నన్నమ్మండి! దిగులు పడుతున్నారా! ఇదంతా కలలా అనిపిస్తోందా!? ఒక విషయం! ఇప్పుడు ప్రకాశిస్తూన్న ప్రముఖ ప్రపంచ నటీనటులంతా ఒకప్పుడు దిక్కుమాలిన వారే. ఉదాహరణలుగా ఎందర్నైనా చెప్పుకోవచ్చు. ఎలిజబెత్ టేలర్ ముందు ఏమంత డబ్బున్నది కాదు. మెర్లిన్ మన్రో, సోఫియా లారెన్, దేవానంద్, రాజకపూర్, హేమామాలిని, కడకు అక్కినేనిని తీసుకున్నా మీకు ప్రత్యక్ష సాక్ష్యాలు!!

కళను అభ్యసించడం వేరు. కళకి అంకితం కావడం వేరు. మీరు కళకి అంకితం కావాలి! గొప్ప గొప్ప నటనలు చేసి ప్రేక్షకుల్ని సమ్మోహితుంచాలి! అటువంటి అవకాశం మీకు కలగాలంటే స్థానచలనం అత్యవసరం! పట్నం పోవాలి. అక్కడికి పోతే నిర్మాతలు మిమ్మల్ని వదలరు. సాష్టాంగ ప్రణామాలు ఆచరిస్తూ తన పిక్చర్‌కు కాల్‌షీట్లు కావాలంటే తన క్కావాలంటూ ముందుకు ఎగబడతారు. కాబట్టి, బంగారు భవిష్యత్తు కావాలన్నా, తమ్ముడూ, చెల్లెళ్ళూ, అమ్మా, నాన్నా, మీ అభివృద్ధి కాంక్షించే నేనూ బాగుపడాలన్నా మీరు స్థల మార్పిడి చెయ్యాలి! తప్పదు!" అంటూ ఎన్నెన్నో గమ్మత్తులు—గారడీలు చేసి, ఉన్నవీ లేనివీ చెప్పి, నంచి, ఒప్పించి అమ్మా నాన్నలకు కూడా చెప్పకుండానే ఒక రాత్రికి రాత్రి తనని పట్నం లేవదీసుకు పోయాడు. ఛ—నిజాన్ని నిక్కచ్చిగా చెప్పుకోవాలి! అలా చెప్పుకుంటే పుట్టె వాళ్ళకైనా ఇంత ముద్దు కలుగుతుంది. తనే లేచిపోయింది అంటే సబబేమో! ఆశ తనని నిలువునా జయించేసింది. ఎడ్వెంచర్ చెయ్యమంది—చేసేసింది.

దాని పరిణామం???

అంత పెద్ద పట్నంలో తనవీ, సత్యన్నారాయణ్ణీ పట్టించుకునే వాళ్ళేరు. అప్పుచేసి తెచ్చిన సొమ్ము ఖర్చయి పోయిందన్నాడు. అన్ని హంగులూ అమర్చే లాడ్జి నుండి చవకబారు లాడ్జికి తరలారు. తన బిక్క చూపులూ, సత్యన్నారాయణ చేతి నలువు కోవటాలు కొందరు గమనించి — ఇదేదో లేవు కొచ్చిన బేరం అని కనిపెట్టేశారు. అతన్ని చాటుగా మాటుగా బేరాలు కుదర్చమన్నారట. అది సత్తిగాడు చెప్తుంటే నిలువునా నిప్పంటించేసుకుని చచ్చి పోదా మనిపించింది. ఇది మంచి పని కాదనిపించి, ఆలోచించి అతని చేత గుళ్ళో తాడు కట్టించేసుకుంది — మెళ్ళో మంగళసూత్రం ఉంటే చూసే వాళ్ళకి కొంచెం గౌరవంగా ఉంటుందని.

అయితే, ఆకలి మీద ఆవురావురు మంటూన్న పులికి రుచికరమైన లేడి మాంసం దొరకడం తడవు క్షణాల మీద తినేస్తుంది. అలానే సత్తిగాడికి తను ఆహారమై పోయింది. ఎక్కడ సంపాదించాడేమో! మరెం డొందలు! హాయిగా ఒక పదిహేను రోజులు సరదాగా గడిపాడు. ఆపైన తను కర్తవ్యం గుర్తు చేస్తే చొరవ తీసుకొని కొత్త కొత్త నిర్మాతల్నీ, డైరెక్టర్లనీ కలిశాడు. ఎవరూ ఏ ఒక్క అవకాశం లేదన్నారు. బెంబేలు పడిపోయాడతను. దినాలు గడవటం కష్టంగా తోచేవి. అంత కష్టంగా

దినాలు గడుస్తుంటే తనెంతగా శోకించిందని!!

ఆదంతా ఒక ఎత్తు! ఆ ఒక్కరోజూ ఒక ఎత్తు! ఆ రోజు తన శోకం వరదలై పారింది. అందులో తన తెలివితక్కువతనం, బలహీనతా, పవిత్రతా అన్నీ కొట్టుకుపోయాయి.

'అభిరుచి గల నిర్మాత' అని ఒక కొత్త వ్యక్తిని ఆరోజు సత్తిగాడు లాడ్జికి తీసుకొచ్చాడు. ఆ నిర్మాత చక్కదవడలూ అతనూ చూడటానికి గూండా వేషం వేసినట్లున్నాడు. తనని ఎగాదిగా చూశాడు. పళ్ళు ఇకిలించి చూపును మింగేస్తున్నట్లు నవ్వాడు. ఏవేవో వేషాలున్నాయని మర్నాడు ఇంటికి రమ్మన్నాడు. తను వెళ్ళింది.

అక్కడేం జరిగింది!?

సత్తిగాడు బయట ఉండిపోయాడు. లోపలికి వెళ్ళిన తనని ఆ నిర్మాత తెగ నలిపేశాడు. కాదు, కూడదని ప్రాధేయపడితే, 'నీ బ్రతుకు నన్నునమ్మక పోతే కుక్కలొల్లే'వని బలవంతం చేశాడు. పారిపోతుంటే జుత్తు పట్టుకుని లాక్కొచ్చి మంచం మీద కుదేసి మానాన్ని హరించేశాడు! అప్పుడెంతో శోకించింది— సత్తిగాణ్ణి నానా తిట్లూ తిట్టింది. కావాలనే ఈ పని చేశావని వాణ్ణి నిందించింది. అమ్మని, నాన్నని, తమ్ముణ్ణి, చెల్లెళ్ళి తలుచుకుని తలుచుకుని ఏడ్చింది.

కార్లు, భవంతులు, నౌకర్లు, చాకర్లు —ఇవేవీ లేవు. నిర్మాతలు చుట్టూ తిరిగి ప్రదక్షిణ చేయటం అంతకన్నా లేదు. తమ్ముణ్ణి కాన్వెంటులో జాయిన్ చేయటం కల! చెల్లెళ్ళకు కోటీశ్వరుల్నిచ్చి పెళ్ళిళ్ళు చెయ్యటం భ్రమ! అనిపించింది— 'గోల' పెట్టి రోదించింది—ఆ రోదనలో ఎన్నెన్ని జరిగిపోయాయి!!!

తన నొదిలి సత్తిగాడు వెళ్ళిపోతే లాడ్జి నుండి దాని స్వంతదారులు తగలేస్తే శారద అనే ఎక్‌స్ట్రా ఆదుకొంది తనని. గుడిసెలోను, గుండెలోను దాచుకొంది. మేస్త్రీగాడికి చెప్పి తనకీ రెండు మూడు ఎక్‌స్ట్రా వేషాలు ఇప్పించింది. ఆ పాత్రలు శారద ఇప్పించిందంటే తనెంత నమ్మను! తనే సంపాదించుకొంది వాటిని — మేస్త్రీ గాడికి ఒప్పగించి. తరవాత ఎందరెందరో తనతో ఆడుకొన్నారు. వాళ్ళకి లెక్కా జమా లేదు.

అప్పట్లోనే గుర్నాథం పరిచయం జరిగింది. అదేదో క్రైమ్ చిత్రం షూటింగుకు ఎక్‌స్ట్రాలుగా తను, శారద వెళ్ళినప్పుడు అక్కడ డూప్‌గా గుర్నాథం స్నేహం దొరికింది. అందర్లాటి వాడే ననుకొంది ముందు రోజుల్లో అతన్ని. కాని, తన ఆలోచన తప్పయింది. గుర్నాథం తనని ప్రేమించాడు— అభిమానించే వాడు— ప్రాణం పెడతానన్నాడు. కటాక్షించమన్నాడు. కటాక్షించింది — ఇద్దరికిద్దరూ కష్టసుఖాలు సమంగా అనుభవిద్దామంటూ ప్రమాణాలు చేసుకొన్నారు. పెళ్ళి చేసుకున్నారు. తన కిష్టం లేకపోయినా ఆ విధంగా మంగళసూత్రం కట్టి పెళ్ళి చేసుకోవడంలో పవిత్రత ఉందన్నాడు గుర్నాథం. తనేం అనలేక పోయింది. సత్తిగాడు వేలాడేసిన మంగళసూత్రాన్ని తడిమి బ్రతుకులోంచి లాగేసింది. ఇప్పుడు జల్సాగా ఉంటూ లేవట్లుగా రోజులు గడిపేస్తున్నారు. తను గర్భవతయింది— బేబీని కన్నది.

సరళకి ఏడు పాగటం లేదు. కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తున్నది. భూతాలు, దెయ్యాలు, పిశాచాలు, పులులు, సింహాలు, నక్కలు—ఎన్నెన్ని ఆమెను జీవితంలో బాధించి పీక్కు తిన్నాయో తలచుకొంటుంటే ఎందుకీ గుండె పేలిపోదు అనిపిస్తోంది.


ఆ బొద్దు మీసాల బోటనీ లెక్చరర్‌ని, ఆ సత్తిగాణ్ణి, అభిరుచి గలదన్న ఆ చప్పిదవళ్ళ కొత్త నిర్మాతల్లాంటి దుశ్శాసనుల్ని గుర్నాథం లాంటి భీము డెందుకు హతమార్చి, గుండెలు చీల్చి, రక్తం దోసిళ్ళతో తాగకూడ దనిపిస్తోంది.

చెయ్, గుర్నాథం! అంత మహత్తరమైన పని నువ్వెందుకు చేసి నాలాంటి స్త్రీకి మనశ్శాంతి కలిగించకూడదు!! అని అనుకొని, గుర్నాథం ఆకారాన్ని తలుచుకొని తల నేలకేసి కొట్టుకొని ఏడ్చింది సరళ.

మొన్ననే—మూణ్ణెల్ల క్రితం ఒక ఫిలిమ్‌లో గుర్నాథం డూప్‌గా వర్క్ చేస్తూ మోటారు సైకిల్ జంపింగ్‌లో చేయి విరగ్గొట్టుకున్నాడు. ఒంటిచేయి మనిషై పోయాడు— అయితే మాత్రం కోటి కోట్ల దుశ్శాసనుల గుండెలకి కసిగా కత్తిపోటు ఆ ఒక్కచేయి ఎందుకు కాకూడదూ అనిపించింది సరళకి.

ఆ ఊహ సరికాదని ఆమె నిప్పు గుండెకు ఎవరు చెప్పగలరు!! చెప్పి ఎవరు ఓదార్చగలరు!?! ప్ప...!!!

*



కాశ్మీర్ సుందరి

—ఫోటో కె. సరోజిని